చంద్రబాబు మోసాన్ని ప్రజలు గుర్తించాలి

మాజీ మంత్రి వనిత

ద్వారకాతిరుమల: ఎన్నికల సమయంలో చంద్రబాబు అబద్ధపు హామీలిచ్చి ప్రజలను ఘోరంగా వెన్నుపోటు పొడిచారని, ఈ మోసాన్ని ప్రజలు గుర్తించాలని మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత అన్నారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలోని ఆర్ఆర్ కల్యాణ మండపంలో వనిత అధ్యక్షతన శనివారం నిర్వహించిన గోపాలపురం నియోజకవర్గ పార్టీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశానికి ద్వారకాతిరుమల మండలం నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, తూర్పుగోదావరి జిల్లా పార్టీ పరిశీలకులు తిప్పల గురుమూర్తి రెడ్డి, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి చందన నాగేశ్వరరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా వారు దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కూటమి ప్రభుత్వ మ్యానిఫెస్టోకి సంబంధించిన క్యూఆర్ కోడ్ కరపత్రం విడుదల చేవారు.



ప్రభుత్వ మ్యానిఫెస్టో క్యూఆర్ కోడ్ కరపత్రం విడుదల చేసిన వనిత, నేతలు



కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

అక్రమ కేసులపైనే దృష్టి

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో వనిత మాట్లాడుతూ చంద్రబాబు ఏడాది పాలన మొత్తం వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టడంతోనే సరిపోయిందన్నారు. చెల్లుబోయిన మాట్లాడుతూ బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఏడాది పాలనలో ఒక్క పథకం కూడా బాబు అమలు చేయలేదని ఆరోపించారు. జక్కంపూడి మాట్లాడుతూ పథకాలు అమలు చేస్తానని చంద్రబాబు చెబుతున్న తేదీలు, పండుగలు మారిపోతున్నాయే తప్ప ఫలితం లేదని ఎద్దేవా చేశారు. ప్రజలను ఇప్పటికీ మభ్యపెడుతూనే కాలం గడుపుతున్నారని ధ్వజమెత్తారు. మోసపూరిత హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తుందనేది ప్రజలే గుర్తించాలని కోరారు. సభలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పోల్కంపల్లి అనీల్, చెలికాని బుల్లియ్య, చెలికాని ప్రవీణ్, బిరుదుగడ్డ చల్లారావు, ఉప్పల మునేశ్వరరావు, దాసరి రాంబాబు, బిరుదుగడ్డ బజారియ్య, గోపా నాగేశ్వరరావు, మద్దిపాటి చిన్న సోమేశ్వరరావు, బొండాడ వెంకన్నబాబు, గుమ్మడి శ్రీను, ప్రత్తిపాటి యోహాను, నల్లూరి వెంకన్నబాబు, నల్లూరి బాపనయ్య, మల్లిపూడి నాగమణి, మస్తాన్ భాష, చిన్న చిన్ని, దాసరి రాంబాబు, దాసరి రాధాకృష్ణ, మానుకొండ కన్నయ్య, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, చిలుకూరి చంద్రం, బొండాడ సాత్యకిరావు, రుద్ర శివ, పానమాల ఉమామహేశ్వరరావు, దూలపల్లి ప్రసాద్, అచ్యుత ఏసుబాబు తదితరులున్నారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



నాగేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న శాంతారావు

లింగపాలెం: వైఎస్సార్ సీపీ లింగపాలెం మండల నూతన అధ్యక్షుడిగా నియమితులైన అన్నపనేని శాంతారావు శనివారం కామవరపుకోటలో నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, ఏలూరు పార్లమెంటరీ ఇన్‌చార్జి కారుమూరు సునీల్ కుమార్ తదితరులు ఉన్నారు.

శ్రీకృష్ణునిగా జగన్నాథుడి దర్శనం



శ్రీకృష్ణ అవతారంలో జగన్నాథుడు

ద్వారకాతిరుమల: శ్రీకృష్ణునిగా జగన్నాథుడు శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి క్షేత్ర దత్తత ఆలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథ స్వామి ఆలయంలో రథయాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని జగన్నాథుడు ఆలయ యాగశాలలో రోజుకో అలంకారంలో భక్తులను సాక్షాత్కరిస్తున్నారు. ఈ క్రమంలో పిల్లన గ్రోవితో శ్రీకృష్ణునిగా దర్శనమిచ్చిన జగన్నాథ స్వామిరిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నేటి నుంచి కోటి పారాయణ



కొయ్యలగూడెం: శ్రీచింతాలమ్మవారి ఆలయం వద్ద ఆదివారం నుంచి కోటి పారాయణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ప్రస్తుతం ఉన్న ఆలయం వద్ద ఉదయం 10 గంటలకు ప్రారంభం చేయనున్నట్టు పాలక మండలి తెలిపింది. నూతనంగా నిర్మించబోయే అమ్మవారి ఆలయ నిర్మాణం నిరాటంకంగా కొనసాగి వచ్చే సంక్రాంతి నాటికి పూర్తయ్యే విధంగా ఏ విఘ్నాలు కలగకుండా అమ్మవారి ఆశీస్సులు అందజేయాలని ఈ పారాయణ కార్యక్రమం ఏర్పాటు చేశామని పేర్కొంది.

పారిజాతగిరిలో పూజలు



స్వామి వారికి పూజ చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరిలో శనివారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఓ భక్తుడు మోకాళ్లపై శ్రీవారి వారి ఆలయం చుట్టూ పొర్లుదండాల ప్రదక్షిణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రాజాన సత్యనారాయణ (పండు) కుటుంబ సభ్యులు శ్రీస్వామివారికి బెల్లం కుందులతో తులాభారం వేసి మొక్కుబడి చెల్లించుకున్నట్టు ఈఓ కలగర శ్రీనివాస్ తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన అర్జ రమేష్, కల్యాణి దంపతులు అన్నప్రసాద వితరణ చేశారన్నారు.

శ్రీవారి సేవలో హాస్యనటుడు కార్తీక్



సతీసమేతంగా హాస్యనటుడు కార్తీక్

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని జబర్దస్త్ కమెడియన్ కెవ్ కార్తీక్ శనివారం సందర్శించారు. సతీసమేతంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు కార్తీక్‌తో సెల్ఫీలు, ఫొటోలు దిగి సందడి చేశారు.

అంజన్నకు అభిషేక సేవ

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో శనివారం ఆంజనేయస్వామికి అభిషేక సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెంకు చెందిన కుక్కల ధర్మరాజు 946 గ్రాముల వెండి శఠారిని కానుకగా స్వామివారికి సమర్పించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవల, విరాళాల ద్వారా రూ.1,04,950 సమకూరిందని, స్వామివారి నిత్యాన్నదాన సత్రంలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్‌వీ చందన తెలిపారు.

పిల్లలు బడిలో చేరాలి

టి.నరసాపురం: నేను బడికి పోతా కార్యక్రమంపై శనిరరాం మండల విద్యావనరుల కేంద్రంలో సమావేశం ఎంఈఓ టి.రామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఐదేళ్లు నిండిన చిన్నారులు నూరుశాతం పాఠశాలల్లో చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తల్లితండ్రుల సమావేశం నిర్వహించాలని తెలిపారు. ఎంఈఓ–2 ఎస్ కల్యాణి, తహసీల్దార్ టి.సాయిబాబ పర్యవేక్షణలో ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు.

పిల్లలు బడుల్లోనే ఉండాలి

బుట్టాయగూడెం: బడి ఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలోనే ఉండే విధంగా చూడాలని ఎంఈఓ టి.బాబూరావు, తహసీల్దార్ పీవీ చలపతిరావులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బడికి పోదాం కార్యక్రమంపై ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో 15 రోజుల పాటు ప్రత్యేక సర్వే చేస్తున్నట్టు వారు చెప్పారు. నూరు శాతం ఎన్‌రోల్‌మెంట్ లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 నరేంద్రరాయ్, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఎం పద్మావతి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ హయాంలోనే అభివృద్ధి

వైఎస్సార్ సీపీ నేత కారుమూరి సునీల్

కొయ్యలగూడెం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి విషయానికి వస్తే వైఎస్సార్ ముందు, అనంతరం అని చరిత్రకారులు, రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారని వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ పేర్కొన్నారు. శనివారం కొయ్యలగూడెంలోని యూనియన్ బ్యాంక్ ఎదుట ఎంపీపీ గంజిమాల రామారావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన 12 అడుగుల వైఎస్సార్ విగ్రహాన్ని ఆయన మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజులతో కలిసి ఆవిష్కరించారు. పోలవరం నియోజకవర్గంలోనే అతిపెద్ద వైఎస్సార్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం తన చేతులమీదుగా నిర్వహించడం పూర్వజన్మ సుకృతమని బాలరాజు పేర్కొన్నారు. వైఎస్సార్ పాలనను ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్రాలు అభివృద్ధిలో పయనిస్తున్నాయని విజయరాజు పేర్కొన్నారు. మహానేత పాలను తిరిగి అందించగలిగింది జగన్‌మోహన్‌రెడ్డి ఒకరేనని, మళ్లీ జగనన్న పాలన కోసం ప్రజలు ఆత్రుతతో ఎదురు చూస్తున్నారని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన సోమరాజు తెలిపారు. అనంతరం నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన 500 మందికి పైగా వైఎస్సార్ సీపీ శ్రేణులతో జంగారెడ్డిగూడెం కొవ్వూరు రోడ్డు, గణేష్ సెంటర్ నుంచి పోలవరం రోడ్డులో భారీ ర్యాలీ నిర్వహించారు. బీవీఆర్ చౌదరి, చిక్కాల దుర్గాప్రసాద్, సాయిల స్వాతి, జెడ్పీటీసీలు దాసరి శ్రీలక్ష్మి, కులుమ హేమ కుమారి, వాసిరెడ్డి మధు, గంటా శ్రీనివాస్, కేసరి సరిత, చిడిపి రవి, దూలపల్లి కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: నిమ్మలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో నిమ్మలగూడెం గ్రామానికి 24 గంటల లైన్ ఏర్పాటు నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. నిమ్మలగూడెం గ్రామంలోని అన్ని రకాల సర్వీసులు గృహ, వ్యవసాయ, కమర్షియల్ విద్యుతు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు ఉద్యోగులకు ఉచిత వైద్య సేవలు

ద్వారకాతిరుమల: శ్రీవారి హరిణి కల్యాణ మండపంలో దేవస్థానం ఉద్యోగుల సౌకర్యార్థం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేయనున్నట్టు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఏలూరుకు చెందిన విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు గుండె, నేత్ర వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు.

నేడు ప్రపంచ జూనోసిస్ డే

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో ఈనెల 6న ప్రపంచ సంక్రమితవ్యాధుల దినోత్సవం సందర్భంగా రాబిస్ వ్యాధి టీకాలు వేయనున్నట్టు పశువైద్యశాల సహాయ సంచాలకులు పీఎన్‌వీ శేఖర్ దొర తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో అవగాహన సదస్సు ఉంటుందన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణం, పరిసర గ్రామాల్లోని పెంపుడు కుక్కలు, పశువులకు ఉచితంగా అందించే రాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పేర్కొన్నారు.

ప్రజారోగ్యమే పరమావధి

జంగారెడ్డిగూడెం: మొగళ్లపు నరసయ్య మెమోరియల్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో శనివారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఏజెన్సీ గ్రామాలకి ముఖ ద్వారమైన జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని సౌకర్యాలు గల ఆసుపత్రిగా అందుబాటులోకి తేవాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో చర్చించినట్లు సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్, ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రభుత్వానికి నివేదిక పంపించామని పేర్కొన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్ అందుబాటులోకి తీసుకురావాలని సభ్యులు కోరారు. హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ మెంబర్లు కంచర్ల గణేష్, నాయుడు శ్రీను, కోటగిరి ప్రమీల, మున్సిపల్ కమిషనర్ వెంకట రమణ, హాస్పటల్ సూపరింటెండెంట్ బేబి కమల, సీఎస్ఆర్ఎంఓ రాంబాబు, నర్సింగ్ సూపరింటెండెంట్, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్, హెడ్ నర్సులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్ల గోడలు కూల్చివేత

కామవరపుకోట: కామవరపుకోట వీరభద్ర స్వామి ఆలయానికి వెళ్లే దారిలో రహదారి విస్తరణ పేరుతో శనివారం అధికారులు ఇళ్ల గోడలను కూల్చివేశారు. శుక్రవారం శ్రీ వీరభద్రస్వామి ఆలయ స్థల వివాదం నేపథ్యంలో ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు ఆలయానికి వెళ్లే రహదారికి రెండు వైపులా ఉన్న ఇళ్ల గోడలు, చెట్లు కూడా కూల్చివేశారు. దీనిపై తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని బాధితులు వాపోతున్నారు. గోడలు కూల్చివేసే సమయంలో గేట్లు సైతం విరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కొందరు గోడలే కూల్చి, మరి కొందరి గోడల విషయంలో చూసీ చూడనట్టు వదిలేశారని ఆరోపించారు. ఈ ఘటనపై ఈఓ కలగర శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఆలయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించామని, పక్షపాతం లేకుండా గోడలను కూల్చివేశామని చెప్పారు. ఆక్రమణల్లో ఉన్న స్థలాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని, తూరలు తొలగించే ప్రక్రియ మొదలు పెట్టామని తెలిపారు.



ఆక్రమణలు తొలగించిన దృశ్యం

పోలవరం రోడ్డు ప్రక్షాళన ప్రారంభం

కొయ్యలగూడెం: ప్రజలు ఆత్రుతగా ఎదురుచూస్తోన్న పోలవరం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. శనివారం రోడ్డుకి ఇరువైపులా ఉన్న వ్యాపార ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగిస్తూ డ్రెయినేజీపై ఉన్న కట్టడాలను కూలగొట్టారు. ఈ పనులను తహసీల్దార్ ఎస్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి కె.సురేష్, వీఆర్‌ఓలు, సచివాలయ కార్యదర్శుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు.

జీవనోపాధి కల్పించండి

చిరు వ్యాపారాల నిర్వహణకు ప్రభుత్వం స్థలం కేటాయించాల్సిందిగా తోపుడుబండ్ల వర్తక సంఘం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. పోలవరం రోడ్డు విస్తరణకు స్వచ్ఛందంగా సహకరించామని, దానివల్ల తమ జీవనోపాధి నిలిచిపోయిందని తెలిపింది. ప్రజలకు కూడా చేరువలో ఉండే విధంగా స్థలాన్ని కేటాయించాలని వినియోగదారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే హనుమంతరావు పేర్కొన్నారు.



పోలవరం రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన దృశ్యం

308 కేసులకు పరిష్కారం



జంగారెడ్డిగూడెంలె లోక అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి

జంగారెడ్డిగూడెం: స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. మొత్తం 308 కేసులు పరిష్కారమైనట్టు జడ్జి తెలిపారు. వీటిలో ఐపీసీ 83, బీఎన్ఎస్ 22, ఎంసీ 7, డీవీసీలు 4, చెక్ బౌన్స్ 29, ఎక్సైజ్ 62, బెంచ్ కోర్టు ఎస్‌టీసీలు 87, బీఎస్ఎన్ఎల్ 8, సివిల్ కేసులు 6 పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

కుక్కునూరు: సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లం ఊటను శనివారం ధ్వంసం చేశామని ఎక్సైజ్ ఎస్సై వెంకటలక్ష్మి తెలిపారు. కుక్కునూరు మండలం జిల్లెలగూడెం అటవీప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో గుట్టుచప్పుడు కాకుండా నాటుసారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల పులిసిన బెల్లం ఊట ధ్వంసం చేశామని చెప్పారు. దాడులలో ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు, ఎన్ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు చేశామని ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. బొమ్మగాని బాలకృష్ణ ఐఎఫ్ఎల్ గ్రీన్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ పేరుతో జంగారెడ్డిగూడెంలో సంస్థ నడుపుతుండగా, ఈ సంస్థలో వీరంకి శ్రీరాములు డైరెక్టర్‌గా, వంకాయల సతీష్, మండపాక వినోద్‌లు సభ్యులుగా ఉన్నారని చెప్పారు. 2024లో బాలకృష్ణ రూ. 27 లక్షలు శ్రీరాములుకు వ్యాపారం నిమిత్తం ఇవ్వగా, అందులో రూ.13,11 లక్షలు మాత్రమే జమ చేశాడని తెలిపారు. బాలకృష్ణ కంపెనీని అనుకరిస్తూ ఐనాకుల ఫార్మర్స్ లైఫ్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ పేరుతో వేరే కంపెనీని నిర్వహిస్తూ, బాలకృష్ణ కంపెనీకి చెందిన సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేశాడని వివరించారు. బాలకృష్ణ కంపెనీకి చెందిన రశీదులు, సర్టిఫికెట్‌లను పోలి ఉండేలా నకిలీలు సృష్టించి వాటిని సొమ్ములు చెల్లించిన వారికి ఇస్తున్నాడని తెలిపారు. దీనిపై శ్రీరాములను నిలదీయగా, బాలకృష్ణపై దౌర్జన్యం చేసి బెదిరించారని, బాలకృష్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

కేసు నమోదు : ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్యాచారానికి పాల్పడబోయిన నేరంపై కేసు నమోదు చేశామని ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. పట్టణంలోని పుట్టింటికి వచ్చిన ఎస్ కనకపుష్ప తను ఇంట్లో ఒంటరిగా ఉండగా గుర్తు తెలియని వ్యక్తి అత్యాచారానికి యత్నించాడని ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

పరిపాలనపై అవగాహన అవసరం

జంగారెడ్డిగూడెం: పరిపాలన సంబంధిత విషయాల్లో మహిళా సర్పంచ్‌లు అవగాహన పెంచుకోవాలని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మార్పు ద్వారా విజేతలు మహిళా సాధికారతతో స్వపరిపాలన సాధ్యం అనే అంశంపై డివిజన్ స్థాయి మహిళా సర్పంచ్‌ల మూడు రోజుల శిక్షణా కార్యక్రమం చివరి రోజు శనివారం ప్రతిభ చూపిన సర్పంచ్‌లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ మహిళలు ఇంటికే పరిమితం కాకుండా ప్రతి రంగంలో రాణించేందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాణించాలన్నారు. మార్పును సాధించగలిగితేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని 10 మండలాలనుంచి ఈ శిక్షణకు 67 మంది మహిళా సర్పంచులు హాజరయ్యారు. ఎంపీడీఓ కేఆర్ఎస్ కృష్ణబాబు, ఎంవోటీలు శ్రీలత (ఎంపీడీఓ, ఏలూరు), కె.శ్రీనివాస రెడ్డి, సీహెచ్ ఆశా అలేఖ్య, టి.ముత్తయ్య తదితరులు శిక్షణ నిర్వహించారు.



కార్యక్రమంలో సర్టిఫికెట్లను అందిస్తున్న జెడ్పీటీసీ బాబ్జి

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

లింగపాలెం: వాతావరణ మార్పులు వల్ల ప్రజలు సీజనల్ వ్యాధులకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎ.సుందరితో కలిసి ఆమె మండలంలో లింగపాలెం, సింగగూడం గ్రామ పంచాయతీలను శనివారం సందర్శించారు. తడి, పొడి చెత్త సేకరణ శానిటేషన్, మంచినీటి సరఫరాపై ఆరా తీశారు. సూచనలు జారీ చేశారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎ.సుందరి పుప్పాలవారిగూడెం, కొత్తపల్లి రంగాపురం, పాశ్చానగరం, కె.గోకవరం గ్రామపంచాయతీను సందర్శించి, శానిటేషన్, తాగునీటి సరఫరా, ఎస్‌డబ్లూపీసీ షెడ్ల పనులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



సింగగూడెంలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీపీఓ అనురాధ

ఏజెన్సీ విద్యార్థులంటే చులకనా?

కుక్కునూరు: ఏజెన్సీ ప్రాంత విద్యార్థులంటే ప్రభుత్వానికి ఎందుకంత చులకన అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొలికపోగు లెనిన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం ఎస్ఎఫ్ఐ కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ తహసీల్దార్ కె.రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా ఇన్‌చార్జి ఎంఈఓ బాబురావు పాఠశాలలను సందర్శించిక పోవడం బాధాకరమన్నారు. ఈ చర్య పరోక్షంగా ప్రైవేటు పాఠశాలల బలోపేతానికి కృషి చేసినట్టుందని పేర్కొన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వర్క లక్ష్మణ్, గంజి వరుణ్, పోతుల సత్యప్రవీణ్, అశ్విని, కార్తీక తదితరులు పాల్గొన్నారు.

శ్రమదోపిడీ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

జంగారెడ్డిగూడెం: కార్మిక శ్రమ దోపిడీ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రజాసంఘాలు, సీఐటీయూ, వ్యవసాయం కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక నవభారత్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ దేశంలోనే పెట్టుబడుదారుల ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. లేబర్ కోడ్ల అమలును ఉపసంహరించుకోవాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్‌కే సుభాషిణి, అధ్యక్షుడు సూర్యరావు, డీవైఎఫ్ఐ కార్యదర్శి జి.సూర్యకిరణ్, పిల్లి పోతురాజు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

8 గంటల పని విధానాన్నే కొనసాగించాలి

ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జూలై 9న సార్వత్రిక సమ్మె సందర్భంగా స్థానిక ధర్మన్న స్మారక భవనంలో కార్మిక ప్రజా సంఘాల అఖిలపక్ష సమావేశం శనివారం సీఐటీయూ పట్టణ కార్యదర్శి పి.సూర్యారావు అధ్యక్షతన నిర్వహించారు. ఏఐటీయూసీ, సీపీఎం, ఐఎఫ్‌టీయూ నాయకులు కుంచె వసంతరావు, మానుకొండ జీవరత్నం, కేవీ రమణలు మాట్లాడారు. సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జూలై 9న ఉదయం 10 గంటలకు పాత పంచాయతీ ఆఫీస్ వద్ద నుంచి ప్రదర్శన ఉంటుందని తెలిపారు. సమావేశంలో వంగా గోపి, జి.కిరణ్, గంపల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ విడుదల

పోలవరం రూరల్: జూలై 9న కార్మిక రైతు, వ్యవసాయ కార్మిక, ఉద్యోగ సంఘాలు చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ రంగాల ముఖ్యకార్యకర్తల సమావేశం పీఎల్ఎస్ కుమారి అధ్యక్షతన నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు కారం భాస్కర్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.భారతి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు సీహెచ్ కుసుమ, పంచాయతీ వర్కర్స్ నాయకులు ఫణి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేద్దాం

కుక్కునూరు: జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెచ్చల రంగారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కుక్కునూరు మండలం మారేడుబాక గ్రామంలో ప్రజాపంథా జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు బాసిన సత్యనారాయణ, గడ్డం ముత్యాలరావు, కె.వీరస్వామి, షేక్ మున్ని, ఎం సుజాత, సీత తదితరులు పాల్గొన్నారు.